# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-45 సంచిక - 8 హైదరాబాదు ఆగష్టు, 2025 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 45 Issue - 8 Hyderabad August, 2025 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

| శ్రీ రమణ జ్యోతి | **Sri Ramana Jyothi** |
|---|---|
| ఆగస్ట్ 2025 | August 2025 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 132వ ప్రవచనం** | రామదాస్ మూర్తి | 3 |
| **2** | **డాక్టర్ టి.ఎన్. కృష్ణస్వామి** | సరోజా ప్రసాద్ | 13 |
| **3.** | **ఎం.వి. కృష్ణన్** | రవికృష్ణ శర్మ | 18 |
| **4.** | **కొంచెంగట్ చోళ నాయనారు** | ఫణిమాల | 21 |
| **5.** | **భగవాన్ భక్తులు - గోవులు** | రమేష్ బాబు | 25 |
| **6.** | **అనుస్మరణీయులు శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు** | | 29 |
| 7. | Staying the Course | Dr K Subrahmanian | 30 |
| 8. | Ashtavakra Gita 39 | V Krithivasan | 37 |
| 9. | Sri Lakshmana Swamy | Madhusudhanan S | 41 |
| 10. | Nagalakshmi Ammal | | 44 |
| 11. | Miracles | Katya Osbourne | 48 |
| 12. | Control of Mind | Ramanananda Swarnagiri | 51 |


## Events in Sri Ramana Kendram in August 2025

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 20th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

## Events in September

Bhagavan's Advent Day - 1st September. The same will be celebrated in the Kendram on the following Sunday - 7th Sept. from 9.00 a.m. - 12.00 noon

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఉద్ధవ గీత

డా॥ కే.యస్. గారి 132వ ప్రవచనం

అనువాదం: రామదాస్ మూర్తి

శ్రీమద్భవద్గీతలో శ్రీకృష్ణుడు:

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥**

(తొమ్మిదవ అధ్యాయం 22వ శ్లోకం) అని అర్జునునితో అన్నాడు. వేరే ఏ ఇతర చింతన లేకుండా నన్నే ధ్యానించే వారి యోగక్షేమాలు నేనే చూసుకుంటాను.

శ్రీమద్భగవద్గీత చెబుతున్నప్పుడు పలు బోధలు వింటూ ఉండిన అర్జునునితో నీవు ఇవన్నీ విన్న తర్వాత ఏమీ తోచక అయోమయంలో ఉండి ఉంటే ఒక విషయాన్ని మాత్రం గుర్తుంచుకో.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥**

ఈ విషయం గురించి మనకు ఒక ప్రశ్న ఉదయించవచ్చు. ఎల్లప్పుడు అలాగ వేరే ధ్యాస లేకుండా శ్రీకృష్ణుడిని మాత్రమే స్మరిస్తూ, మనిషి జీవనోపాధి మార్గం కూడా ఆలోచించకుండా ఉంటే, నేను నా కుటుంబం సంగతి ఎలాగ? శ్రీకృష్ణుడు మోక్షాన్ని ఇస్తానని అనలేదు. వాళ్ళ రోజువారి అవసరాలకు సంబంధించినవి

తాను భావించే విధంగా అందేటట్టు చూస్తానన్నాడు. ఇక్కడ గుర్తించ వలసినది ఏమంటే శరణాగతి చెందిన వారికి రాజభోగాలు కల్పిస్తానని మాట ఇవ్వలేదు. ఈ సందర్భంలో మనం ఋషులు, మునుల సంగతి పరిశీలిస్తే వాళ్లు పేదవారే గాని తమ బీదరికం గురించి ఎప్పుడూ ఆలోచించక, సంతృప్తులై ఉండేవారు. ఆ తరువాత అర్జునునికి తన ధర్మము, కర్మ మొదలైన వాటి గురించి ఇదమిత్థమైన అభిప్రాయాలు లేవన్నాడు. కర్తవ్యం తెలియలేదని కృష్ణుడు అన్నాడు. క్షత్రియుడైనందువల్ల అర్జునుని విధి, కర్తవ్యం యుద్ధం చేయడమేనని బోధించాడు. ఏ శంక లేకుండా అలాగ కానివ్వమన్నాడు. పుస్తకాలను, గ్రంథాలను పఠించినప్పటికీ మనకు అర్థం కానివి చాలా ఉంటాయి. కొంతవరకు అవి ఉపయోగపడి నప్పటికీ అనుభవం ద్వారానే అసలు విషయాలు తెలియ వస్తాయి. పుస్తకంలో ఉన్న దాని ప్రకారం నడుచుకొని మేధోపరమైన జ్ఞానాన్ని పొందడం వల్ల లాభం లేదు. ఎక్కువ చదివే కొద్దీ మనస్సు మరింత గందరగోళంలో పడుతుంది.

## కేవలం శాస్త్ర పఠనం నిరుపయోగం

శృతి స్మృతి పురాణాలలోని అన్ని విషయాలను అవగాహన చేసుకున్న శ్రీ ఆదిశంకరులు సత్యాన్ని పుస్తకాలు చదివి తెలుసు కోవాలని ఎందుకు సమయం వృథా చేసుకుంటారు?. అనుభవం అన్నిటికంటే ముఖ్యమైనది. నేను ఎవరు అన్నది శోధించి తెలుసు కోవాలి అని అన్నారు. **“భజగోవిందం భజగోవిందం గోవిందం భజ**

**మూఢమతే సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే"** అని సంస్కృత వ్యాకరణ సూత్రాన్ని వల్లెవేస్తున్న వారికి చెప్పారు. సంస్కృతాన్ని నేర్చుకున్నప్పటినుండి నాకు ఎన్నో తెలుసును అన్న గర్వం ఏర్పడుతుంది. ఉపనిషత్తులు వేద శాస్త్రాలను అభ్యసించినప్పటికీ, అనుభవం సంపాదించుకొనక శాస్త్రాలలో చెప్పినది ఆచరించకపోతే, యముడు ప్రత్యక్షమైనప్పుడు అవి ఉపయోగపడవు. అందుకే గోవిందుడిని భజించమన్నారు. కేవలం శాస్త్ర జ్ఞానం వల్ల మరణ భయం పోదు. **"శబ్దజాలం మహారణ్యం, చిత్తభ్రమణ కారణం"** అన్నారు శంకరులు. ఒక హద్దును దాటాక శాస్త్ర పఠనంలో పదాలు, వాటి శబ్దాలలో మునిగితే అది శబ్దాలతో నిండిన అరణ్యంలోనికి వచ్చినట్లుంది'' అని అన్నారు.

''గ్రంథ పఠన కొంతవరకు మంచిదే. కానీ వాటిలో చెప్పినట్లు నడుచుకుంటున్నామా? శాస్త్రాలు అసలు మొదట నీవు ఎవరో తెలుసుకో అని తెలియపరుస్తున్నాయి'' అని భగవాన్ చెబుతూ వచ్చారు. ప్రతి ఒక్కరము నేను, నేను అంటూ ఉంటాము. ఇది ప్రతి భాషలోనూ ఉన్నది. జపము, పూజ లేదా ధ్యానము ద్వారా ఆ విషయాన్ని తెలుసుకోవాలి. శ్రీమద్ భాగవతంలో ఎందరో ఋషులు, మునుల గురించి చదువుతాం. వాళ్ళు అసాధారణమైన వాళ్లు. కానీ గోపికల వలె శ్రీకృష్ణుని పట్ల అంత గొప్ప నమ్మకం లేనివారే. శాస్త్రాలు చదివిన వారి కంటే గోపికలకు శ్రీకృష్ణుని గురించిన అవగాహన మరింత ఎక్కువ. ఇటువంటి అవగాహన వాళ్లకు లేకపోయింది. తమ హృదయాలలో శ్రీకృష్ణుని గురించి

అపారమైన ప్రత్యేక ప్రేమ భావం గోపికలకు ఉండేది.

ఉద్ధవుడు అనే ఒక గొప్ప ఋషి శ్రీకృష్ణునితో అతి సన్నిహితంగా మెదులుతూ ఉండేవాడు. సాధారణంగా తరచు తాను దూర ప్రాంతాలకు వెళ్లే అలవాటు ఉన్న ఉద్ధవుడు చాలా రోజులు ఎక్కడికో వెళ్లి వచ్చాడు. శ్రీకృష్ణుని కలిసిన ఉద్ధవుడు, "పాండవులు ఎలా ఉన్నారు? అందరూ కశలమే కదా?" అని అడిగాడు. శ్రీకృష్ణుడు "గొప్ప యుద్ధం జరిగింది. అందులో దుర్యోధనునితో సహా కౌరవులు అందరూ చనిపోయారు" అని చెప్పాడు.

శ్రీకృష్ణునికి అతి సన్నిహితుడైన ఉద్ధవుడు సామాన్యుడు కాడు, గొప్ప శాస్త్ర జ్ఞాని. అయినా కాని కృష్ణుని మాటలు విన్న ఉద్ధవుడు కోపంతో రెచ్చిపోయాడు. "అలాగా అందరూ చనిపోయారా? నీవు చేసిన కుతంత్రం వల్లే అసలు యుద్ధం జరిగింది" అంటూ కృష్ణుడిని తప్పు పట్టాడు. కానీ కృష్ణుడు చిరునవ్వుతో "నేను యుద్ధం ఆపడానికి చాలా ప్రయత్నించాను. ఆఖరుకు దుర్యోధనుని వద్దకు శాంతి దూతగా కూడా వెళ్లాను. కానీ సంధి కుదరలేదు" అన్నాడు. కానీ ఉద్ధవునికి నమ్మకం కలగలేదు. శ్రీకృష్ణుని మాట చివరకు అంగీకరించి సెలవు తీసుకున్నాడు.

## కృష్ణుని వరం

కృష్ణుడు ఉద్ధవుని ఒక వరం కోరుకోమన్నాడు. ఉద్ధవుడు తనకేమీ అక్కర్లేదన్నాడు. తన తృప్తి కోసం ఏదైనా కోరుకోమనిన కృష్ణునితో తాను ఎక్కడెక్కడో తిరుగుతుంటానని, ఒక్కొక్కసారి

ఎడారుల గుండా పయనిస్తుంటానని, అలాంటి సమయంలో త్రాగడానికి నీళ్లు అవసరం పడుతుందన్నాడు. అందుకే తాను నీటిని తలుచుకున్నప్పుడల్లా నీరు లభించాలి అన్నాడు. కృష్ణుడు అలాగే జరుగుతుందని వరం ఇచ్చాడు.

అలాగే ఒకరోజు అడవిలో ప్రయాణిస్తున్న ఉద్ధవునికి దాహం వేసింది. నీరు కావాలని తలచుకున్నాడు. కృష్ణుని కోసం కాచుకున్నాడు. కాసేపట్లో ఒక మనిషి వచ్చి నీళ్లు అవసరమా అని అడిగాడు. ఆశ్చర్యపడిన ఉద్ధవుడు ఆ వ్యక్తి దగ్గర ఒక తోలు సంచిలో బోలెడు నీళ్లు ఉండటాన్ని చూశాడు. చూడడానికి అతను అపరిశుభ్రంగా, దిగువ జాతి వ్యక్తిగా ఉద్ధవునికి అనిపించింది. తనలో తాను ''ఓ ప్రభూ నన్ను పరీక్షిస్తున్నావా? నేను నీళ్లు అడిగాను కానీ తోలు సంచిలో ఒక అపరిశుభ్రమైన వ్యక్తి ద్వారా పంపిస్తావా? ఇది న్యాయం కాదు'' అనుకుంటున్నాడు. ఆ వ్యక్తి మాత్రం ''మీకు దాహంగా ఉన్నట్లుంది నీళ్లు కావాలా'' అని అడుగుతూనే ఉన్నాడు.

ఉద్ధవుడు నీళ్లు కావాలని అడగకుండా అలా నిలుచుండి పోయాడు. శ్రీకృష్ణుని తిడుతూనే ఉన్నాడు. నీళ్లు తెచ్చిన వ్యక్తి మాత్రం చిరునవ్వుతో మర్యాదగా ''దాహం వేస్తోంది కదా, నీళ్లు తీసుకో''మంటున్నాడు. ఉద్ధవుడు ఆ వ్యక్తితో అసలు మాట్లాడ లేదు. కాసేపు అలా చూస్తూ ఉంటే ఆ అసహ్యమైన వ్యక్తి శ్రీకృష్ణునిగా మారాడు. నిర్ఘాంతపోయిన ఉద్ధవుడు ''ఇదంతా నీ మాయ. ఈ వ్యక్తి రూపంలో నీవు వస్తావని అనుకోలేదు'' అన్నాడు.

కృష్ణుడు ఉద్ధవునితో ''నీ పట్ల నాకున్న అనురాగం వల్ల నీవు

చాలా గొప్ప వ్యక్తివి అనుకున్నా. ఆ ఉద్దేశంతో ఇంద్రుని వద్దకు వెళ్లి, నా స్నేహితుల్లో ఒకరు గొప్ప జ్ఞాని. అమృతం ఇస్తే నేను దానిని తీసుకువెళ్లి ఉద్ధవునికి ఇస్తాను అని అడిగాను. కానీ ఇంద్రుడు మామూలు మానవులకు అమృతాన్ని ఇవ్వను అన్నాడు. కానీ నేను మాత్రం అతను అసామాన్యుడు. నన్ను గురించే ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటాడు అన్నాను.

పూర్తిగా నమ్మకం కుదరని ఇంద్రుడు ‘‘అమృతాన్ని ఎవరితోనో ఒక తోలు సంచిలో పోయించి ఇస్తాను. ఉద్ధవుడు నిజంగా గొప్పవాడు అయితే, ఎవరితో పంపారు?, అతను తక్కువ కులస్థుడు, తోలు సంచిలో నీళ్లు తెచ్చాడని తప్పు పట్టడు అన్నాడు. యథార్థానికి అందులో అమృతమే ఉంటుంది. ఈ షరతుకు లోబడి మాత్రమే నేను అమృతాన్ని పంపగలను’’ అని ఇంద్రుడు అన్నాడు. అంగీకరించి కృష్ణుడు దాన్ని తీసుకువచ్చాడు.

‘‘నా నమ్మకాన్ని నీవు వమ్ము చేశావు. పైపైన కనిపించే వాటిని పట్టించుకున్నావు. ఈ విషయం అర్థం చేసుకున్న ఇంద్రుడు సంచిలోని అమృతాన్ని తీసేసుకున్నాడు. నేను నా రూపంలో ఇప్పుడు ఇలాగ ఉన్నానన్నాడు’’ శ్రీకృష్ణుడు. ఈ కీలక బోధనాంశం ‘‘ఉద్ధవ గీత’’గా భాగవంతంలో పేరుపొందింది. జ్ఞాని హెచ్చుతగ్గులు, వర్ణము మొదలైన భేదాలను పట్టించుకోడు. ఉద్ధవుని ప్రవర్తన శ్రీకృష్ణుని నిరాశ కలిగించింది. అదే గోపికల విషయానికి వస్తే వాళ్లకు ఏ శాస్త్రాలు తెలియవు. వాళ్లు మాత్రం

ఏదో కారణం వల్ల శ్రీకృష్ణునిపై గొప్ప నమ్మకం, ప్రేమ చూపిస్తారు. ''ఆయన మా దగ్గర లేకపోతే మాకు అమితమైన దుఃఖం కలుగుతుంది'' అనేవాళ్ళు. హృదయాల నిండా కృష్ణుడే ఉండేవాడు. ఉద్ధవుని మనస్సు మొత్తం శాస్త్రజ్ఞానంతో నిండిపోయి ఉన్నప్పటికీ గోపికలలాగా హృదయం అంత పరిశుద్ధమైనది కాదు.

**"తవ కథామృతం తప్త జీవనం"** అంటారు. వ్యాసుడు స్వయంగా భాగవతంలోని కథలను వినడం గొప్ప విషయం అన్నారు. జీవితమనే నిత్యాగ్నిలో తపించి పోతున్నవారికి భాగవతంలోని కథలు అమృతం లాంటివి. అందుకే శంకరులు **"నహి నహి రక్షతి డుకృమ్ కరణే"** అన్నారు. భగవాన్ కూడా, ''శాస్త్ర పఠనం చేయవచ్చు. కానీ ఒక దశ వరకు తెలుసుకున్న తర్వాత దానిని ఆపు చేయాలి. చదువుకున్నది ఆచరణలో పెట్టాలి'' అనేవారు.

లడ్డు మిఠాయి రుచి ఎలా ఉంటుందని అడిగితే, అడిగి నప్పుడు దానిని మాటల్లో వర్ణించడానికి ప్రయత్నిస్తే ఎంత తెలివి గల వారికైనా అర్థం కాదు. లడ్డు రుచి తెలియాలంటే లడ్డును తినాలి. మన ఋషులు, యోగులు ఎలా భగవంతుడిని అనుభూతి చెందారో మన మనస్సు, ఆలోచనలకు అతీతమైనది. **"అవాఙ్మానస గోచరం"** మన జ్ఞానేంద్రియాలకు మించినది. కనుక పెద్దలు ''ఆ అనుభవాన్ని జపము, ధ్యానము, పూజ, నామ సంకీర్తన ద్వారానే గ్రహించగలుగుతాం'' అని చెప్పేవారు. మనము మానసిక

ప్రశాంతత కావాలనుకుంటాం. అది బాహ్యం నుంచి రాదు. మనలోపలే గ్రహించదగినది.

## సోహం భావన

మన విధి, కర్తవ్యాలను శక్తిమేర నిర్వహిస్తే కూడా మనశ్శాంతి లభిస్తుంది. అసలు చేయవలసినది నేను ఎవరు - సోహం అన్నది తెలుసుకోవాలి. నేను శరీరం కాదు, సోహం - ఆ ఉన్నత శక్తియే. అలా ఆచరణలో జరిగినప్పుడు జీవితంలో ఎదురయ్యే అన్ని సమస్యలను ఎదుర్కొనే శక్తి లభిస్తుంది. భగవాన్ ఈ విషయంలో మనస్సును నిలకడగా ఉంచడానికి ప్రయత్నించాలని, ప్రతిరోజు పూర్తిగా పనిమీద ధ్యాసలో ఉండకుండా కొంత సమయాన్ని సోహం భావనకై సమయాన్ని కేటాయించాలని చెప్పారు. తాపీగా ఒకచోట కూర్చుని దైవాన్ని గురించి ఆలోచించడం, పూజ లాంటి ఇతర ఆచరణలలో మునగడం లాభదాయకమని అన్నారు. అలా చేయటం వలన రోజువారి సమస్యలను ఎదర్కొనే శక్తి వస్తుంది. జయాపజయాలను గురించిన తపనలు ఏర్పడవు అని అన్నారు.

మరొక విషయం - చాలామంది తాము పూజలు చేస్తే కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి అనుకుంటారు. అది సాధ్యం కాదు. పుట్టిన ప్రతి ఒక్కరికి సమస్యలు ఏర్పడతాయి. శ్రీరాముడు, శ్రీకృష్ణునికి సమస్యలు వచ్చాయి. వాటిని వారు ఎలా ఎదుర్కొన్నారో తెలుసుకోవాలి. సమస్యలు రాక మానవు. కానీ ఆ సందర్భాలను సమర్ధవంతంగా పరిష్కరించుకునే శక్తి భగవంతుడు ప్రసాదిస్తాడు. కర్మలు

ఆచరించడం మన కర్తవ్యం. వాటి ఫలితాలు మాత్రం భగవంతుని ఆధీనంలో ఉంటాయి.

## కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం

ఇక జీవితంలో తరచూ జరిగేది మరొకటి. ఇతరులతో పోల్చుకుని ఎదుటివారు ఎక్కువ స్థాయిలో ఉన్నారు, వారు ఎక్కువ ప్రతిష్ఠ కలిగి ఉన్నారని బాధపడటం అర్థరహితం. నీవు ఎలాగ ఉండాలి అన్నది ఉన్నత శక్తి నిర్ణయిస్తుంది. మనం మరో స్థాయిలో ఉండాల్సినది అన్న ఆలోచనల వల్ల ప్రయోజనం లేదు. ఎందరో పేద ప్రజలను మనం చూస్తుంటాం. వాళ్లకు సహాయం చేయాలని అనుకున్నప్పటికీ స్తోమత అడ్డు రావచ్చు. కానీ వాళ్ల కోసం చేయదగిన దానిలో కొంత మాత్రమే చేయగలిగినప్పటికీ హృదయాంతరాళంలో వాళ్లను గురించిన తపన ఉండదు. ఇవ్వదలచుకున్నది హృదయపూర్వకంగా శ్రద్ధతో ఇవ్వాలి. **శ్రద్ధయా దేయం** అన్నారు. యాచకుని కూడా అవమానంతో చూడరాదు.

## ధ్యానం కాలహరణ కాదు

మన ప్రవర్తనను బట్టి మనం ఎలాంటి వారమో తెలుస్తుంది. వైద్యుడు శస్త్ర చికిత్సకు ముందు తాను ఉపయోగించే పరికరాలన్నిటిని క్రిమిరహితంగా ఉండడానికి స్టెరిలైజ్ చేస్తాడు. అది సమయాన్ని వృథా చేయడం కాదు. చికిత్స సబబుగా జరగడానికి అది అవసరం. అలాగే మనం ఉదయాన్నే నిద్ర లేస్తున్నప్పుడు వెంటనే చర్యలలోకి దిగకుండా కొంతసేపైనా ధ్యానం చేయాలి.

రోజులో మిగతా సమయం అంతా చక్కగా సాగుతుంది. ఉదయం ధ్యానం, పూజ లాంటివి అలవాటు చేసుకుంటే మనలో నుండి చెడు ఆలోచనలు తొలగిపోతాయి. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనగలుగుతాం. అలాగే నిద్రకు ఉపక్రమించే ముందు రాత్రి కూడా భగవధ్యానం మంచిది.

**"చిదానంద రూప శివోహం శివోహం"** అని శంకరులు అంటారు. "నేను స్వయంగా శివుడిని, మామూలు మనిషిని కాను," అంటారు. **"దహ్రమ్ విపాపం పరమేశ్వర భూతం యత్పుండరీకం పురమధ్య సజ్‌స్థం"** క్రమంగా భగవంతుడు బాహ్యంగా లేడు, నా హృదయ కుహరములో ఉన్నాడు అనేది అనుభూతి కావాలి. నేను, నేను అని ప్రకాశిస్తున్నాడు అనేది దర్శించాలి. **"ఏకమక్షరం హృదినిరంతరం భాసతే స్వయం లిఖ్యతే కథం"** అక్షరమైనది, నిరంతరంగా నీ హృదయంలో "అహం అహం" అని ప్రకాశిస్తూనే ఉన్నది. మరొకటి ఏదీ లేదు. అదే అద్వైతం. శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుడు, తనను అందరిలోను, తనలో అందరినీ దర్శించగలిగినవాడు స్థితప్రజ్ఞుడు అన్నాడు. భగవాన్ రమణ మహర్షి కూడా దానిని తెలుసుకోవడానికి ఎవరూ గొప్ప పండితుడు కానక్కరలేదు, అనుభూతి అవసరం అని అన్నారు. అది భగవంతుని కృపతోనే లభిస్తుంది. కానీ అందుకు మన ప్రయత్నము అవసరం. ఏది జరిగినప్పటికీ వాటికి అన్నిటికీ మనం కేవలం సాక్షి మాత్రంగానే ఉండాలి.

******

# భగవాన్ నా జీవితంలోకి ఎలా వచ్చారు?
# డాక్టర్ టి.ఎన్. కృష్ణ స్వామి

శ్రీ రమణాశ్రమ ప్రచురణ Fragrant Petals లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం

**జూన్ సంచిక తరువాయి భాగం** **సరోజా ప్రసాద్**

ఆ హాలులో వెలుతురు ఫోటోలు తీసుకోవడానికి చాలినంతగా లేదు. అయినా సరే, మహర్షి ఫోటోలు కొన్ని తీశాను. తర్వాత లేచి నిలబడి యాంత్రికంగా మహర్షి ముందు సాగిలపడ్డాను. హాలు నుండి బయటికి వచ్చి ఆశ్రమం వెలుపలికి వస్తుండగా కాషాయ వస్త్రాలు ధరించిన సన్న్యాసి ఒకరు మా వెనకే పరుగెత్తి వచ్చారు. ''మీరు తీసిన ఫోటోల ప్రింట్లు మాకు ఆశ్రమం చిరునామాకు పంపండి. భగవాన్ ఫోటో మంచిది ఏది లేదు మా దగ్గర'' అన్నాడు. ఆయన ఎవరో కాదు, ఆశ్రమం సర్వాధికారి శ్రీ నిరంజనానంద స్వామి. ఆ సంఘటన గురించి నేనింకేమి ఆలోచించలేదు. అది నా జీవితంలో ఎంతో ముఖ్యమైనది అవుతుందని కలలో కూడా ఊహించలేదు. మద్రాసు వచ్చాక ఫోటోలకు ప్రింట్లు వేయించి, ఆశ్రమానికి కొన్ని పంపించాను.

ఇక నా చదువుల్లో మునిగిపోయి తిరువణ్ణామలై గురించి మరిచిపోయాను. ఒకరోజు నాకు ఉత్తరం వచ్చింది - నేను తీసిన ఫోటోలు భక్తులందరికీ ఎంతో నచ్చాయని, అందుచేత మహర్షితో గ్రూప్ ఫోటో తీయడానికి ఆశ్రమానికి రావాలని, ఆ ఉత్తరంలో ఆహ్వానించారు. నా పరీక్షలు ముగిసేవరకు ఈ ఫోటో కార్యక్రమం

వాయిదా వేస్తే బాగుంటుంది కదా, అనిపించింది. కాని, ఎందుకనో, తిరువణ్ణామలై రైలు ఎక్కేశాను. ఆశ్రమంలో మహర్షి సన్నిధికి చేరగానే ఆయన చిరునవ్వుతో పలకరించారు. "వాళ్లకు గ్రూప్ ఫోటో కావాలట. అది మీరే తీయాలంటున్నారు" అన్నారు మహర్షి. ఆ ప్రశంసకు నేను పొంగిపోయాను. ఇక్కడికి రావడం మంచిదైంది అనుకున్నాను. ముఖ్యంగా మహర్షి ప్రశంసనందుకోవడం ఎంతో సంతోషం కలిగించింది. అక్కడి భక్తులందరినీ ఒక బృందంగా ఫోటోకు అనువుగా అమర్చి నా కెమెరాతో కొన్ని ఫోటోలు తీశాను. నా ఫోటోల కోసం భగవాన్ పద్మాసన భంగిమలో ఒక ప్రతిమ లాగ నిశ్చలంగా కూర్చున్నారు. ఈ ఫోటోలు వేలాది కాపీలు ఆశ్రమంలో అమ్ముడయ్యాయట.

ఇంకొక సందర్భంలో నేను హాలులోకి ప్రవేశిస్తుండగా మహర్షి ఇలా అన్నారు "ఇప్పుడే మీ గురించి అనుకుంటున్నామో లేదో, మీరే వచ్చేశారు! ఎంత కాకతాళీయమో చూడండి! మీకు వ్రాసిన జాబు పోస్టు చేయడానికి సిద్ధం చేశారు. మీరే స్వయంగా తీసుకోండి". ఆశ్రమానికి ఎప్పుడు వెళ్ళినా ఉదయం వెళ్లి సాయంకాలానికి తిరిగి రావడమే. కాని ఆ కాస్త వ్యవధిలోనే మహర్షి వెంట అనుసరిస్తూ సాధ్యమైనన్ని ఫోటోలు తీసేవాడిని. ఈ విధంగా వెంటపడి వారిని విసిగిస్తున్నానేమో అని కూడా అనిపించేది. వారు కాళ్ళు కడుక్కుంటుండగా, నడుస్తుండగా, కూర్చున్నప్పుడు, భోజన సమయంలోను ఎన్నో ఛాయా చిత్రాలు తీశాను. చిరునవ్వు చిందిస్తుండగా, నోరారా నవ్వుతుండగా, పసిబిడ్డలా మందస్మితంగా,

ధ్యానముద్రలో, సమాధిస్థితిలో... ఇలా ఎన్నో ఫోటోలు తీశాను. ఒకరోజు చిరుజల్లులు పడుతుండగా మహర్షి కొండపైకి వెళ్ళడానికి బయలుదేరడంతో తాటియాకుతో చేసిన దేశవాళి గొడుగు ఇచ్చారెవరో. ఈ ఆకు గొడుగు తలపై పెట్టుకున్న మహర్షి ఫోటో తీయగలిగాను. మామూలు గొడుగు పట్టుకున్న సందర్భంలో కూడా ఫోటో తీశాను. నేను ఫోటో తీస్తుండగా మహర్షి హాయిగా నవ్వారు!

వారితో నేను గడిపిన ఆ కొద్ది గంటలు నాకు అనిర్వచనీయమైన శాంతి, సంతృప్తి అనుభవమైనాయి. ఎంతో ఉల్లాసంగా ఇంటికి తిరిగి వచ్చాను. మహర్షి చిరపరచితులుగా, ఎంతో సన్నిహితులుగా అనిపించారు. వారి సమక్షంలో చాలా సౌఖ్యంగా ఉండేది. తండ్రి ప్రేమ, చనువు, వారి వద్ద అనుభవించాలనిపించేది. నిజానికి వారు కూడా నన్ను తండ్రిలాగే వాత్సల్యంగా చూసుకున్నారు. ఆశ్రమానికి వచ్చే అశేష భక్తులందరికీ వారి సన్నిధిలో ఇదే అనుభూతి కలగడం విశేషం. ప్రతి ఒక్కరు మహర్షి తమ పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నట్లే భావించేవారు.

మహర్షితో నడిచి వెళ్లినపుడల్లా అక్కడ జరిగే సంభాషణలు వినడమో, వాటిలో నేను కూడా పాలుపంచుకోవడమో జరిగేది. ఒకరోజు మేము కొండపైకి వెళుతుండగా, తళతళ మెరుస్తున్న గుండ్రటిరాయి త్రోవలో కనపడింది. వారు దాన్ని చేతిలోకి తీసుకొని నాకు చూపుతూ, ''ఈ పర్వతంలో ఏదో ఒక పవిత్రమైన చోటి నుంచి ఒక రాయి కావాలని విదేశాలనుంచి ఎవరో అడిగారు. ఈ పర్వతం యావత్తు పవిత్రమేనని వారికి తెలియదు. ఇది సాక్షాత్తు

పరమ శివుడే. మనం మన శరీరాలతో తాదాత్మ్యం చెందినట్లు ఆ శివుడు ఈ పర్వతంతో తాదాత్మ్యం చెందాడు. అరుణాచలమంటే పర్వతరూపంలో ఉన్న జ్ఞానం. తన కోసం పరితపించే భక్తుల ఎడల కరుణతో వారి భౌతిక నేత్రాలకు దర్శనం ఇవ్వాలని మహేశ్వరుడు ఈ పర్వతంగా అవతరించాడు. దీని నుండే జిజ్ఞాసువులకు ఆయనే దారి చూపి సాంత్వన కలిగిస్తాడు'' అన్నారు. ఆ పలుకులు నా హృదయంలో నాటుకుపోయాయి. అరుణాచలం పవిత్రతను స్వయంగా మహర్షే చెప్పారు. అది చాలు నాకు.

ఒకవంక ''ఈ శరీరం నేను కాదు'' అని మహర్షి బోధిస్తే నేను ఇలా ఛాయాచిత్రాలను పట్టుకు ప్రాకులాడడం హాస్యాస్పదంగా అనిపిస్తుండేది. నీడల వెంట పరుగెత్తడమే కాక, వాటిని నిశ్చల చిత్రాలుగా ముద్రించి, జాగ్రత్త చేయడం వెఱ్ఱితనమేనా? నేను మహర్షిని దర్శించి వారితో గడిపినంతకాలమూ వారి ఉపదేశంలోని సారాంశం నాకు అంత ముఖ్యంగా తోచలేదు. వ్యక్తిగా వారి పట్ల నాకేదో ఆకర్షణ మాత్రం కలిగింది. వారి ఫోటోలు తీయడమంటే నాకు ఎనలేని ఆనందం. వారి బోధల కన్నా వారంటేనే నాకు ఇష్టం. వారు ఏ చిన్న పని చేసినా, చిన్న సంజ్ఞ చేసినా నాకది ఎంతో గొప్పదిగా, దివ్యంగా కనపడేది. వారు ఏమి చేస్తున్నా సరే, వారిని అలా చూస్తూ ఉండడమే ఎంతో తృప్తిగా ఉండేది. పసిబిడ్డ తల్లి చెంత చేరినంత ఆకర్షణ నాకు ఆయనపట్ల...

భగవాన్ మహానిర్వాణం నాకు ఆశనిపాతమైంది. ఆ మహాజ్ఞాని ఉపదేశామృతాన్ని గ్రోలే అవకాశం కోల్పోయాను. ఆధ్యాత్మిక

సాధనంటూ నేను చేసిందేమీ లేదు. వారి పవిత్ర సన్నిధిలో వారి ఉపదేశాలు విని, అర్థం చేసుకొని, ఆచరించే ప్రయత్నం చేయడానికి బదులు ఫోటోలు తీస్తూ ఆ అమూల్య అవకాశాన్ని వృథా చేసుకున్నానా? లేదేమో... నాకు మహర్షి అనుగ్రహం లభించింది. అది నాకు నమ్మకంగా తెలుసు. వారు ఇక్కడే ఉన్నారు. మనమే వారి ఉనికిని తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. తాను ఎక్కడికి వెళ్ళడం లేదని స్వయంగా వారే అభయం ఇచ్చారు కదా, మనల్ని ఎలా విడిచివెళ్లగలరు?.

ఇక అటు తర్వాత, భారమైన హృదయంతో మహర్షి బోధలను అధ్యయనం చేయనారంభించాను. వాటిలో నాకొక దివ్య ప్రకాశం కనపడసాగింది. కొన్ని చదువుతుంటే చలించిపోయాను. వారి సమక్షంలో కూర్చుని వింటున్నట్టే ఉన్నది. నెమ్మదిగా గుండె దిటువు చేసుకున్నాను. చదివే కొద్ది మహర్షి మరింత సన్నిహితులైనట్టు తోచింది. వారి ఉపదేశాలలో ప్రాణశక్తి తొణికిసలాడుతుంది. వాటిని అర్థం చేసుకునే ప్రయత్నంలో వాటిలో లీనమైపోయాను.

******

# భగవాన్ జీవితంతో అనుసంధానమైన కొన్ని సంఘటనలు

## ఎం.వి. కృష్ణన్

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Surpassing Love and Grace **లోని వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: రవికృష్ణ శర్మ**

ఆగష్టు 29, 1896న వెంకటరామన్ (తరువాత భగవాన్) మదురైను వీడి తిరువణ్ణామలైకు బయలుదేరిన రోజు. ఒక వారం తరువాత మునగాల ఎస్. వెంకటరామయ్య, తరువాతి కాలంలో రమణానంద సరస్వతిగా పేరుగాంచిన వారు, మదురై నుండి షోలవందన్‌లో ఉన్న తన ఇంటికి వెళ్లి తన తల్లితో, మదురైలో తను చదువుకుంటున్న స్కూలు ప్రక్కన ఉన్న స్కూల్ నుండి ఒక బ్రాహ్మణ బాలుడు ఇంటిని వదిలి పారిపోయాడని చెప్పాడు. ఆ సమయంలో పారిపోయిన ఆ బాలుడినే తాను తరువాతి కాలంలో అంటే 1918లో స్కందాశ్రమంలో కలవబోతున్నానని, ఆ బాలునికే అనుయాయుడనవుతానని కొంచెము కూడా ఊహించక పోయి ఉండవచ్చు. 1933 నుండి 1950 వరకు శ్రీ భగవాన్‌తో అతి సన్నిహితంగా మెలగి 'శ్రీరమణ మహర్షితో సంభాషణలు' అనే సాధికారకమైన గ్రంథానికి గ్రంథకర్త అయినారు.

మునగాల ఎస్. వెంకటరామయ్య పుత్రులయిన ఎం.వి. రామనాథన్ మరియు ఎం.వి. కృష్ణన్ తమ తల్లితండ్రులతో కలసి 1930వ సంవత్సరం వేసవి కాలంలో ఆశ్రమానికి వచ్చారు. వాళ్ళ

వయస్సు అప్పుడు 13 సంవత్సరాలు మరియు 10 సంవత్సరములు. ఒక రోజున పాత భోజనాల గది (ఇప్పుడక్కడ భగవాన్ సమాధి ఉన్నది) వద్ద నిలుచున్న సమయంలో పెద్దవాడైన రాము, గత కొన్ని రోజుల నుండి తాము ఉల్లిగడ్డతో చేసిన సాంబారును రుచి చూడలేదని మాటవరుసకు అన్నాడు. అదే క్షణంలో శ్రీ భగవాన్ వంటశాల నుండి తిరిగి వస్తూ ఆ బాలురు ఉన్న ప్రదేశం నుండి వెళుతున్నారు. భగవాన్ చిరునవ్వు నవ్వి రామూని ఇలా అడిగారు - "అయితే మీకు వేంగాయ (ఉల్లిగడ్డ) సాంబారు కావాలన్నమాట". అలా అడగడంతో వాళ్ళిద్దరూ సిగ్గుపడి మౌనం వహించారు. మరుసటి దినం ఉదయం అందరితో పాటు ఆ పిల్లలిద్దరికీ వేంగాయ సాంబారు వడ్డించడం జరిగింది. అందరూ వాళ్లకు వడ్డించినది ఉల్లిగడ్డ సాంబారే అనుకున్నారు. ఆ రోజుననే కొంత సమయం తరువాత శ్రీ భగవాన్ ఉల్లిగడ్డ సాంబారు రుచి ఎలా ఉన్నదని రామూని అడిగారు. దానికి రాము "చాలా బాగున్నది" అన్నాడు.

అయితే తాను తిన్నది ఉల్లిగడ్డ సాంబారు కాదని వెల్లుల్లితో చేసిన సాంబారు అనే సత్యాన్ని కొన్ని రోజుల తరువాత తన తల్లి ద్వారా విని ఆశ్చర్యపోయాడు. ఆ సమయంలో ఆశ్రమంలో ఉల్లిగడ్డలు లేవని అయినా, శ్రీ భగవాన్ ఆ పిల్లల కోరికను తీర్చాలని అనుకున్నారు. తమ పాకశాస్త్ర నైపుణ్యముతో భగవాన్ వెల్లుల్లి సాంబారును ఉల్లిగడ్డ సాంబారులా వాసన, రుచి వచ్చే విధంగా చేశారు.

మునగాల వి. కృష్ణన్ 1940వ సంవత్సరం డిసెంబర్‌లో ఉద్యోగం కోసమని ఢిల్లీ వెళ్లాడు. 1941 ఫిబ్రవరి చివరి వరకు ఉద్యోగం దొరకలేదు. దానితో తన తండ్రి శ్రీ వెంకటరామయ్యకు ఉత్తరం వ్రాస్తూ తనకు ఉద్యోగం దొరకకపోవడం వలన తిరిగి దక్షిణ భారతానికి వస్తున్నాను అని అందులో తెలియజేశారు. ఆ ఉత్తరాన్ని శ్రీ భగవాన్‌కు చూపినప్పుడు అది చదివి భగవాన్ వెంకట రామయ్య గారితో అతనిని "ఢిల్లీలోనే ఉండమనండి" అని అన్నారు. మార్చి నెలలో అతనికి ఉద్యోగం దొరికింది. అప్పటి నుండి వి. కృష్ణన్ జీవితంలో చక్కగా రాణించారు.

******

# పరమేశ్వరునియందు నాయనార్ల భక్తి
# కొంచెంగట్ చోళ నాయనారు

**ఫణిమాల**

కావేరీ నదికి 'పొణ్ణి' అనే పేరు కూడా కలదు. తిరువానైక్కైవళ్ అనే ఊరిలో పొణ్ణి నది తీరంలో చంద్ర తీర్థం వద్ద కొంచెంగట్ చోళుడు అనే నాయనారు జంబుకేశ్వరాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయానికి 'తిరువానైక్కోవిల్' అనే పేరు కూడా కలదు. ఇచ్చటనే శ్రీరంగనాథ స్వామి వారి దేవాలయం కూడా ఉండడం విశేషం. ఈ నాయనారుకు 'కొంచెంగన్నన్' అంటే ఎర్రటి కళ్ళు కలవాడు అనేటటువంటి నామం సార్థక నామధేయమైనది. ఈ నాయనారు పూర్వ జన్మ వృత్తాంతము ఈ జంబుకేశ్వర దేవాలయంతో ముడిపడి ఉన్న కారణంగా ఆ పూర్వ జన్మ వృత్తాంతం ఏమిటో తెలుసుకుందాం.

పూర్వం ఈ చంద్ర తీర్థం వద్ద జంబు వృక్షాలతో కూడిన ఒక అందమైన తోట ఉండేది. నేరేడు చెట్టికి జంబు వృక్షము అని కూడా పేరు. ఆ తోటలో ఒక జంబు వృక్షం కింద ఒక శివలింగం ఉండేది. ఈశ్వర భక్తికి సకల జీవరాసులు అర్హులే అనేటటువంటి సత్యాన్ని రుజువు చేసే వృత్తాంతమే మనం ఇప్పుడు తెలుసుకో బోతున్నాం. ఒక తెల్లటి ఏనుగు రోజూ అక్కడికి వచ్చి శివలింగం ముందు సాష్టాంగ నమస్కారం చేసి ఎంతో భక్తిగా ఆ శివలింగాన్ని ఆరాధించేది. అదే తోటలో పరమేశ్వర భక్తికి అంకితమైన జీవాన్ని

కొనసాగిస్తున్న ఒక సాలీడు, ఎండిన ఆకులు ఈశ్వరునిపై పడటం గమనించి, దీనిని నివారించడానికి ప్రతిరోజు శివలింగం పైన ఒక వల నేసేది.

మరుసటి రోజు ఏనుగు పూజకు వచ్చినప్పుడు, ఆ వలను గమనించి, ఎవరో ఆ ప్రదేశాన్ని కలుషితం చేశారని భావించి, వలను చీల్చి, పూజ చేసి అక్కడి నుండి నిష్క్రమించేది. మరుసటిరోజు సాలీడు అక్కడికి వచ్చి, తన వల నాశనమైందని బాధపడి, మరొక వల నేసి వెళ్లిపోయేది. ఆ తర్వాత రోజు, ఏనుగు వల లాగుతుండగా, అక్కడ ఉన్న సాలీడు దానిని కుట్టింది: విషం కారణంగా ఏనుగు అక్కడికక్కడే మరణించింది. సాలీడు కూడా ఏనుగు తొండంలో చిక్కుకుని చనిపోయింది.

అపార కారుణ్యమూర్తి అయిన పరమేశ్వరుడు అక్కడ ప్రత్యక్షమై ఏనుగుకు మోక్షాన్ని అనుగ్రహించాడు. సాలీడు చోళ రాజు సుబదేవుని కుమారుడిగా జన్మించింది. అతను మరియు అతని భార్య చిదంబరం వెళ్లి, నటరాజ స్వామిని కొడుకు కోసం ఎంతో ఆత్రంగా ప్రార్థించారు. పరమేశ్వరుడు వారి కోరికను తీర్చాడు. సుబదేవుని భార్య కమలవతి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవ దినం ఆసన్నం కాగా కొన్ని నిమిషాల తరువాత బిడ్డ జన్మించగలిగితే, అది మూడు లోకాలను పాలించగలదని జ్యోతిష్కులు ప్రవచించారు! రాణి తనను తలక్రిందులుగా గది పైకప్పుకు కట్టి, నడుము చుట్టూ గట్టి కట్టు కట్టాలని కోరింది. శుభ సమయం

రాగానే, ఆమెను విడుదల చెయ్యగా మగశిశువు జన్మించాడు. ఇది సాలీడు పునర్జన్మ! ఆ బిడ్డ తన తల్లి గర్భంలో కొంచెం ఎక్కువ సేపు ఉండటంతో ఎర్రటి కళ్ళు కలిగి ఉన్నాడు. తల్లి అతని కళ్ళలోకి చూస్తూ "కొచేకన్ననో" (ఎర్రటి కళ్ళు ఉన్న బిడ్డ) అని సంబోధించి మరణించింది. అందుకే, అతనికి కొంచెంగట్ చోళన్ అని పేరు పెట్టారు. అతను సరైన వయస్సుకు చేరుకున్నప్పుడు, సుబదేవుడు కుమారుడికి రాజుగా పట్టాభిషేకం చేసి, తాను వానప్రస్థాశ్రమం స్వీకరించాడు.

అపార శివ భక్తి గల ఈ నాయనారు సుమారు 70 శివాలయాలను, చోళ దేశంలో నిర్మించారు. వాటన్నింటిలో ఆపోలింగంగా ప్రసిద్ధికెక్కిన జంబుకేశ్వర దేవాలయం ఎంతో ప్రఖ్యాతి గాంచింది. ఈ దేవాలయము రెండు వేల సంవత్సరాల పురాతన దేవాలయం. ఆ జంబు వృక్షం కింద ఉన్న శివలింగం చుట్టూ ఈ అందమైన ఆలయాన్ని 5 పెద్ద ప్రాకారాలతో, ఏడు రాజగోపురాలతో నిర్మించాడు కొంచెంగట్ చోళుడు. ఈ దేవాలయంలో పరమేశ్వరుడు పశ్చిమాభిముఖంగా ఉన్నాడు. ఇచ్చట పార్వతీదేవిని 'అఖిలాండేశ్వరి' అనే పేరుతో భక్తులు పూజిస్తారు. ఈ ఆలయాన్ని నీటిమూలకంగా పరిగణిస్తారు. ఇది పంచభూత స్థలాలలో ఒకటి అని భావిస్తారు.

కొంచెంగట్ చోళ నాయనారు నిర్మించిన ఈ జంబుకేశ్వర దేవాలయాన్ని సుందరర్, అప్పర్, జ్ఞాన సంబంధర్, మాణిక వాచకర్

వంటి నాయనార్లు మరియు అగస్త్యుడు, గౌతముడు, పరాశరుడు, ఆదిశంకరులు మొదలైన భక్తవరేణ్యులు సందర్శించుకున్నారు. బ్రహ్మతీర్థం, ఇంద్ర తీర్థం, జంబూ తీర్థం, తెప్పోత్సవం జరిగే రామ తీర్థం, శ్రీమత్ తీర్థం, అగ్ని తీర్థం, అగస్త్య తీర్థం, సోమ తీర్థం, సూర్య తీర్థం వంటి గొప్ప తీర్థ జలాలు ప్రవహించే అరుదైన పుణ్యక్షేత్రం తిరువానైక్కావళ్.

పంచభూత లింగ స్థలక్షేత్రాలలో ఒకటైన ఈ క్షేత్రంలో జంబుకేశ్వరాలయం నిర్మించిన కొంచెంగట్ చోళుడు నాయనార్లకే వన్నె తెచ్చిపెట్టే భక్తిని ప్రదర్శించాడు. అంతేకాక, చిదంబరంలో మూడు వేల మంది బ్రాహ్మణులకు ఉపయోగపడేలా అనేక మందిరాలు మరియు భవనాలను నిర్మించాడు.

******

## అధ్యాయము - 4

# భగవాన్ భక్తులు - గోవులు

**శ్రీ రమణాశ్రమ ప్రచురణ** Bhagavan Ramana The Friend of all **లోని 4వ అధ్యాయానికి స్వేచ్ఛానువాదం**

(గత సంచిక తరువాయి) రమేష్ బాబు

## శ్రీ జి.వి. సుబ్బరామయ్య

సుబ్బరామయ్యరు మాటలలో చెప్పాలంటే ఆవుకు ఇది ఒక అపూర్వమైన గౌరవము: అమ్మ మరణించినప్పుడు కూడా భగవాన్ ఇలా కవిత వ్రాయలేదు. సర్వాధికారి ఆ పద్యాన్ని ఒక నల్లరాతి మీద చెక్కించి, దానిని గోలక్ష్మి సమాధి మీద శిలాఫలకంగా ఏర్పాటు చేయమని చెప్పారు. లక్ష్మిని భూస్థాపితం చేసిన చోటు ఒక పుణ్యమైన సమాధిని నిర్మించ మని, సమాధిమీద గోలక్ష్మి విగ్రహం నిలబెట్టాలని చెప్పారు.

దేవరాజు మొదలియార్ ఆశ్రమం సందర్శించి సమాధి మీద శిలాఫలకాన్ని చదివి “భగవాన్, మీరు విముక్తి అన్నారు, మనం మామూలుగా మరణించిన వారు సమాధి చెందారు, విముక్తి పొందారు అని అంటాం కదా ఆ అర్థంలోనే వాడారా? లేక విముక్తి అంటే నిజమైన మోక్షాన్ని పొందారు అనే అర్థంలోనే వాడారా? అని అడిగారు. భగవాన్ నిజమైన మోక్షము అనే అర్థంలోనే వాడబడింది అన్నారు. భగవాన్ తరచు గోశాలకు వెళ్ళి అక్కడ ఉన్న ఆవుల గురించి విచారించేవారు. భగవాన్‌కు అక్కడున్న ఆవుల్లో గోలక్ష్మి సంతానం స్పష్టంగా తెలుసు. ఆ సంతానంలోని

ఏ ఒక్క దూడ కూడా గోలక్ష్మిలాగా పరుగు పరుగున భగవాన్ దగ్గరకు రాలేదు.

సూరి నాగమ్మ భగవాన్‌తో గోశాలకు వెళ్ళినప్పుడు భగవాన్, ఆమె మోక్షమార్గంలో పురోగమించడానికి పూర్వజన్మలో చేసిన పుణ్య కార్యాలు, తీవ్రమైన సాధన గోలక్ష్మిని మీ సన్నిధికి చేర్చాయి. మోక్ష సాధనే ఆమె తిరుగులేని లక్ష్యం కదా! అని అన్నది. అది నిజమే! పూర్వ జన్మలో ఆమె చేసిన పుణ్యకార్యాలు, సాధనతో చేసిన కృషి, మోక్షం కోసం ఆమె పడ్డ ఆరాటం, గోలక్ష్మిగా ఆమెను మన ముందుకు తీసుకువచ్చాయి. ఆమె చేసిన పుణ్యకార్యాల ఫలితంగా మాత్రమే గురుశిష్యులు ఒక్కటయ్యారు. అది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. దైవాజ్ఞ. ప్రతి శుక్రవారం లక్ష్మి సమాధి మీద పూజ జరిగేది. లక్ష్మి సమాధి పొందిన రోజు మట్టు పొంగల్ పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహించేవారు.

### నల్ల ఆవు

**సూరినాగమ్మ గారి లేఖలలో ఒక నల్ల ఆవు పవిత్రమైన దయార్ద్రమైన శ్రీరమణుల వారి కంటి చూపు కోసం చివరి శ్వాస దాకా వేచి చూసిన సంఘటన:**

గోశాలలో గత మూడు రోజుల నుండి ఒక నల్ల ఆవు అనారోగ్యంతో అవస్థపడుతున్నది. దూడల కోసం నిర్మించిన షెడ్డు దగ్గరలో ఉన్న చెట్టుకు ఆమెను కట్టి ఉంచారు. భగవాన్ ఆ మార్గంలో రాలేదు కాబట్టి మూడు రోజుల నుండి ఆమెకు భగవాన్ దర్శనం దొరకలేదు. క్రిందటి రోజున ఆమె భయంకరమైన మరణవేదన అనుభవించింది. ఈ రోజు ఉదయం నుండి భీకరమైన బాధ పడుతున్నా అలాగే కొట్టుకుంటుంది.

భగవాన్ మామూలుగా (4.45) సాయంత్రం తన మంచం నుండి లేచి గోశాల వెనకకు వచ్చారు. ఆయన తిరిగి వెళ్ళే వేళ నల్ల ఆవు కట్టి ఉన్న చెట్టు దగ్గరకు వచ్చి, ఆగి ఆ నల్ల ఆవు పడుతున్న మరణవేదనను కొంతసేపు చూశారు. భగవాన్ దయకు ప్రతిరూపము. సహజంగా ఆయన హృదయం జాలిగా ద్రవీభవించింది. ఆ ఆవును బంధవిముక్తురాలిని చేయాలని ఒక చల్లని చూపు చూశారు. ఆ తరువాత యథావిధిగా తన మంచం మీదకు వెళ్ళి కూర్చున్నారు. దయాపూర్ణమైన భగవాన్ దృష్టి ప్రసరించగానే ఆ నల్ల ఆవులోని జీవికి ఐదు నిముషాలలో ఈ బాధల నుండి విముక్తి లభించింది. ఏ జీవికైనా మరణానికి ముందు దైవచింతన కలిగితే ఆ జీవి ఈ సంసార బంధనాల నుండి విముక్తి పొందుతుంది. ఆ నల్ల ఆవు అదృష్టం ఏమని వర్ణించగలం. పవిత్రమైన దయా పూర్ణమైన ఆయన చల్లని చూపు సోకి నల్ల ఆవు జన్మ సంసార బంధనాల నుండి విముక్తి పొందింది. ఎన్నో జంతువులు రోజుల తరబడి బాధపడుతున్నవి. ఒక్కసారి భగవాన్ కంటిచూపు సోకితే దానికి ఇక బాధపడవలసిన అవసరం లేదు. కొన్ని జంతువుల విషయంలో యాదృచ్ఛికంగా చూడడం జరిగేది. వాటికి కూడా భగవాన్ చూపు సోకిన తరువాత, వెంటనే ప్రశాంతంగా అవి జీవన్ముక్తి పొందేవి. భక్తులందరికీ నల్ల ఆవు చావు ఓ నిదర్శనం. భగవాన్ చేతుల మీదుగా జంతువులు మోక్షం పొందిన సంఘటనలెన్నో ఉన్నాయి. గోలక్ష్మి, వల్లి జింక, జాకీ కుక్క, ఆశీస్సులు పొందిన కాకి వంటివి మాత్రమే మనకి తెలుసు. మిగిలినవి గ్రంథస్థం కాకపోవడం వలన ప్రపంచానికి తెలియదు.

## దూడ - ఒక భక్తుడు

**ఒక భక్తుడు భగవాన్ నిర్వాణానంతరం ఒక దూడకు భగవాన్ పట్ల గల భక్తిని వర్ణించే ఘటన.**

ఆశ్రమంలో ఒక దూడ శ్రీరమణ నగర్లో ఉన్న భగవాన్ భక్తుల ఇండ్లను సందర్శించేది. భక్తులు ఆమెను ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించి పళ్ళు ఫలహారాలు పెట్టేవారు. ఒకరోజు నేను శ్రీరమణాశ్రమంలో ఉండగా ఒక స్నేహితుడు వచ్చి ఆశ్రమం దూడ మాయింటి ఆవరణలో నిలబడి ఉందని చెప్పాడు. వెంటనే ఆనందంగా నేను దూడకు పళ్ళు ఫలహారాలు ఇవ్వాలని ఇంటికి వేగంగా వెళ్ళాను. దూడ మాయింటి ఆవరణలో కనిపించలేదు. ఇంటి లోపలికి వెళ్ళిందేమోనని, ఇంటి లోపలికి వెళ్ళి చూస్తే అక్కడ కనబడలేదు. నేను మా పడక గదిలోకి ప్రవేశించాను. దూడ భగవాన్ చిత్రపటము ముందు నిలబడి పూర్తిగా ఆయన దృష్టిలో లీనమై ఉన్నది. దూడ కన్నులు ప్రేమ, భక్తి నిండి భగవాన్ వైపే కేంద్రీకరింపబడి ఉన్నాయి. ఆ దూడ తన నుదురు భగవాన్ చిత్రపటానికి తాకించి ఉన్నది. అది ఆ క్షణంలో భగవాన్లో మానసికంగా లీనమై పోయినట్లుగా ఉన్నది. నేను గదిలోకి ప్రవేశించిన విషయము కూడా గమనించలేదు. తన పరిసరాలను అది మరిచిపోయింది. ఆ దూడ ప్రేమ, భక్తి చూచి నేను మంత్రముగ్ధుడనయ్యాను. ఒక దూడకు భగవాన్ పట్ల ఉన్న భక్తి సాంద్రత నాకు లేనందుకు నేను ఎంతో సిగ్గుపడ్డాను. పడక గది నుండి హాలులోకి దూడ వచ్చే దాకా వేచి ఉన్నాను. అది హాలు నుండి బయటకు వచ్చిన తరువాత పళ్ళు ఫలహారాలు అందించాను. ఆ దూడ శరీరంలో, భగవాన్ భక్తుడైన ఏ మహనీయుని ఆత్మ, అందులో అద్దెకుందో ఎవరికి తెలుసు.

# అనుస్మరణీయులు
# శ్రీ పిమ్మరాజు రామ సుబ్బారావు

(గత సంచిక తరువాయి)

"అమ్మా! నీవు ఇవాళ నీ పుట్టింటికి వచ్చావు అని అనుకో" అని చెప్పి, ఖాళీగా నున్న కిటికీ బయట నుండి చీరను తీసి రాధమ్మ గారికి ఇచ్చారట. అలా భగవంతుడు నన్ను ఆదుకోవాలి అని ప్రార్థించిన సుబ్బారావు గారి జీవితంలోకి బాబాగారు రావటంతో ఇక అప్పటి నుండి సుబ్బారావు గారు ఏ పని చేసినా 'బాబా నీ దయ' అని అంటూ ఉండేవారు. వారు బాబాగారితో చివరిగా ఇలా అన్నారట. 'బాబా, మమ్మల్ని మీరు వదలవద్దు' అని అంటే బాబాగారు 'మీరు నన్ను వదిలినా నేను మిమ్మల్ని వదలను' అని అన్నారట.

తరువాతి కాలంలో సుబ్బారావు గారు బాబాగారిని దర్శించుకోవటానికి పుట్టపర్తి వెళ్ళినా దూరం నుండే దర్శించుకొనే వారు తప్ప మళ్ళీ దగ్గరికి వెళ్లి కలవాలని ఆశించలేదు. ఎందుకు బాబాగారిని కలవాలని అనుకోలేదు? అని వారి పిల్లలు వారిని అడిగితే - 'బాబాగారు ఇవ్వవలసినదంతా ఇచ్చివేశారు కాబట్టి మళ్ళీ మళ్ళీ కలవాలని కానీ, మాట్లాడాలని కానీ అనిపించటం లేదు' అని అనేవారట. అంటే వారికి ఒక్క దర్శనంలోనే సంపూర్ణ సంతృప్తి కలిగింది. అప్పటి నుండి నెలకో, రెండు నెలలకో ఒకసారి పుట్టపర్తికో లేదా శిరిడికో వెళ్ళేవారు. (సశేషం)

## Staying the Course

Dr K Subrahmanian

There is no way in which we can completely understand Bhagavan and God; whatever we may say about them is true, and yet, not completely true. My idea of Bhagavan is the result of my unique experiences, my *sadhana* and my reading. The only person who can completely understand Bhagavan is Bhagavan himself; and once we become Bhagavan or God, there is no need to explain anything. The need to explain something to someone happens only when there is the feeling of separateness. When I am you, and you are me, there is no need to explain anything. When you understand me reasonably well, you don't need to talk to me for a very long time. When two individuals understand each other, there is no need for them to talk; they can choose to remain silent. Even when they do have a conversation, it needn't be a lengthy one – a little smile or a gesture is sufficient to get across the message. So, all our attempts at trying to understand Bhagavan, God or *jnanis* is an attempt to understand ourselves a little better. When I try to understand Bhagavan, I think of him; when I think of him, I think of him through his grace. When there is grace, there is a little better understanding of myself.

Where there is perfect understanding, there is perfect silence. A person can communicate through silence, and this silence is no ordinary silence; it is the silence of the mind. Bhagavan, who was Dakshinamurthy himself,

communicated a peace that cannot be described through his silence. It was a peace that was the result of a total absence of body consciousness, and a total lack of individuality. So, by the grace of Bhagavan, we must aim for the highest, without thinking if it is possible for us to achieve. We go to a number of places and do a variety of things in order to get peace; there will come a time, however, when we will be unable to go to as many places as we would like to. Going on a pilgrimage and attending *satsangs* may become impossible as we continue to age. At such times, we must remember how extraordinarily simple Bhagavan has made things for us. He has made it clear that there is no need for any of these things; the most important thing is to understand yourself. When this is achieved, there is nothing else to understand. We are all interested in reason; we should all, therefore, be interested in the ultimate question – the reason why we were born and who we are.  These are questions to which people will not be able to give a satisfactory answer. Bhagavan says that if we are able to answer the question 'Who am I?', there is nothing else to realise.

Most of us feel that finding out who we are is the most difficult thing to do, but it is the easiest. We have to have faith that with Bhagavan's grace we will be able to figure out the answer. In fact, Bhagavan himself has made an extraordinary statement that our very quest to find an answer is the result of his grace; it is because of his grace that we set out on this quest. The moment we realise that our quest is the result of his grace, we don't have to worry

